ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 31 జూలై 2025 | 5

మేథస్సుకు పరీక్ష 6
» విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
» శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా ప్రోత్సాహం
» 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' దరఖాస్తుకు 6వతరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అవకాశం
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30 వరకు గడువు

నౌకాశ్రయం!



కాకినాడలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ నిర్మాణ యోచన

» అనువైన ప్రాంతానికి అన్వేషణ
» 110 ఎకరాలకు ప్రతిపాదన
» బుధవారం పర్యటించిన ప్రతినిధులు
» డీప్‌వాటర్‌పోర్టులో పరిశీలన
» రూ.900 కోట్లతో కేంద్రం
» అన్నీ కుదిరితే పెద్ద ప్రాజెక్టు
» మారీటైంబోర్డు సానుకూలత
» మూలపేటపైనా కసరత్తు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్ యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) ఇక్కడ శాటిలైట్ షిప్ యార్డు నిర్మాణానికి మొగ్గు చూపుతోంది. ఈ మేరకు హెచ్‌ఎస్‌ఎల్ అధికారికంగా ధ్రువీకరించింది.ఈ నేపథ్యంలో కాకినాడలో అనువైన భూముల లభ్యత ఎక్కడ ఉందనేది పరిశీలిస్తోంది. ఇప్పటికే ఇక్కడ ఓ సంస్థ ఎప్పటి నుంచో నౌకలు తయారు చేస్తుండడం,ఇక్కడున్న సానుకూల వాతావరణంతో కాకినాడే ఖాయమయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

కాకినాడ అనువైన ప్రాంతం

నౌకల నిర్మాణం చేపట్టడానికి సముద్రపు అలల తాకిడి తక్కువగా ఉన్న ప్రాంతం చాలా కీలకం.ఇది కాకినాడలో ఉంది. పైగా ఒకప్పుడు బ్రిటిష్ యుగంలో కోరంగి వద్ద నౌకల తయారీ, మరమ్మతులు జరిగేవి. అప్పుడే ఈ రంగంలో కాకినాడ పేరొందింది. కానీ ఆ తర్వాత పెద్దగా ఈ రంగం కాకినాడలో విస్తరించలేదు. నౌకల తయారీకి సముద్రానికి ఆనుకుని విశాలమైన భూములు అవసరం. వీటిలో నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారు చేసి ఆ పక్కనే ఉన్న సముద్ర జలాల్లోకి వీటిని దించి పరీక్షలు చేసి సరుకు రవాణాకు వినియోగిస్తారు.ఈ అనుకూల వాతావరణం కాకినాడలోనే ఉంది. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఇన్ని సానుకూలతలు కాకినాడకు ఉన్నాయి.

గతంలో చాలా కంపెనీలు..

గతంలో కాకినాడలో షిప్‌యార్డు నిర్మించడానికి సింగపూర్ కంపెనీ ముందుకు వచ్చింది. కాకినాడ సీపోర్టులో కొంతకాలం కార్యకలాపాలు నిర్వ హించింది. వివిధ దశల్లో రూ.1,725 కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. ప్రోత్సాహం కరువై ఇక్కడ యార్డును మూసేసింది. ఎల్‌అండ్‌టీ కంపెనీ 2006లో కాకినాడలో షిప్‌యార్డు నిర్మాణానికి ముందుకొచ్చింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. కానీ అప్పటి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక చెన్నైకు వెళ్లిపోయింది. 2020లో రూ.7 కోట్ల కాకినాడ స్మార్ట్‌సిటీ నిధులతో జగన్నాథపురం సమీపంలో అధికారులు బోట్ బిల్డింగ్ యార్డు నిర్మించారు.ఇందులో ఒకేసారి 18 వరకు భారీ బోట్లు తయారుచేసే వసతులు సిద్ధం చేశారు. కానీ తగిన ప్రోత్సాహం లేక అదీ ఈసురోమంటోంది. కొచ్చిన్, గోవా, మజ్‌గావ్‌లో హిందుస్థాన్ షిప్‌యార్డులు 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నౌకలను నిర్మిస్తున్నాయి.ప్రస్తుతం కాకినాడలో శాన్‌మెరైన్ అనే సంస్థ ఎన్నో ఏళ్లుగా చిన్న, మధ్య తరహా నౌకలు, బార్జీలు, టగ్‌లు నిర్మిస్తోంది. గతేడాది 8వేల టన్నుల భారీ నౌకను నిర్మించింది. వచ్చే ఐదేళ్లలో మరో 25 వరకు నిర్మించి దేశవ్యాప్తంగా పలు కంపెనీలకు అందివ్వడానికి సిద్ధమవుతోంది. ఈ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డుతోను పలు ఒప్పందాలు చేసుకుంది.

ఓకే అంటే రూ.900 కోట్లు

బుధవారం డీప్‌వాటర్‌పోర్టు ఏరియాలోని రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను హిందుస్థాన్ షిప్‌యార్డు ప్రతినిధులు పరిశీలించారు.భూముల లభ్యత.. సముద్రానికి ఎంత దూరం వంటివన్నీ పరిశీలించారు. ఇక్కడే ఉన్న మారీటైం బోర్డు అధికారులతోను సమావేశమయ్యారు.ఈ నేపథ్యంలో త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ కాకినాడలో భూములు ఓకే అయితే రూ.900 కోట్ల వరకు హిందుస్థాన్ షిప్‌యార్డు ఇక్కడ పెట్టుబడులు పెట్టనుంది. ప్రస్తుతం రక్షణశాఖకు అవసరమైన అన్నిరకాల యుద్ధ,ఇతర నౌకలను హెచ్‌ఎస్ఎల్ నిర్మిస్తోంది. భారత నావికాదళంతో రూ.19 వేల కోట్ల విలువైన భవిష్యత్తు ఆర్డర్లు ఈ సంస్థకు ఉన్నాయి.ప్రస్తుతం విశాఖలో ఉన్న షిప్‌యార్డుకు బ్రాంచ్ యార్డుగా కొత్తది నిర్మించనున్నారు. తద్వారా నౌకల నిర్మాణం మరింత వేగవంతం చేయాలని ఈ సంస్థ ఆలోచన. కాకినాడతో పాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట తీరప్రాంతాన్ని హెచ్‌ఎస్‌ఎల్ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది.దాదాపుగా కాకినాడవైపే హెచ్ ఎస్ఎల్ ఎక్కువ ఆసక్తి చూపుతోందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ సానుకూలతతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏపీ మారిటైం పాలసీకి కాకినాడ కేంద్రంగా ఉన్న రాష్ట్ర మారిటైం బోర్డు కార్యాలయం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇక్కడే భూముల కేటాయింపు జరిగేలా పర్యవేక్షిస్తోంది.



సీఎంను కలిశారు..

రాష్ట్రంలో భారీ నౌకల నిర్మాణం విశాఖలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డు చేపడుతోంది.ఇది మినహా షిప్‌యార్డు మరెక్కడా భారీగా లేదు. త్వరలో మరో షిప్‌యార్డు నిర్మించడానికి కాకినాడ అనువైనదిగా భావిస్తోంది. 110 నుంచి 150 ఎకరాల భూములు ఉన్న చోట షిప్‌యార్డు నిర్మాణం చేపడతామని హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ ఇత్రీ ప్రకటించారు.ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిసి తమ ప్రతిపాదన వివరించారు.షిప్‌యార్డుకు కాకినాడే అనువైనదిగా ఆ సంస్థ భావిస్తోంది.

పేరుకే పట్టా.. స్థలం ఎక్కడ?



అమలాపురం రూరల్ మండలం పేరూరులంకతోటలో మెరక చేయని ఇళ్లస్థల పట్టాల భూమి

» ఇళ్లస్థల భూముల సేకరణలో చిత్రవిచిత్రాలు
» ఐదేళ్లు గడిచిపోయినా మెరక పనులు లేవు
» పట్టాలు ఇచ్చారు సరే.. పొజిషన్ ఎప్పుడు
» జగనన్న లేఅవుట్ల లబ్ధిదారులపై పునఃపరిశీలన

అమలాపురం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వేలాదిమంది నిరుపేదలు ఇళ్లస్థల పట్టాపత్రాలతో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఐదేళ్లుగా తమకు కేటాయించిన ఇళ్లస్థలాలు ఎక్కడ ఉన్నాయో చూపిస్తారని. ఇళ్ల స్థలాలు అయితే చూపించలేదు గానీ ఆయా పట్టాలను మాత్రం గతేడాది ఎన్నికలకు ముందు గత వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి మళ్లీ అందించింది. తమ పేరున రిజిస్టర్డ్ పట్టా ఉందని చెప్పుకోవడమే ఆ పేదలకు మిగిలింది. వేలాదిమంది లబ్ధిదారులైతే ఏగ్రామంలో ఇళ్లస్థలాలు కేటాయించారో తెలియని పరిస్థితి. మరి కొందరికైతే ఎక్కడో పదినుంచి 15కిలోమీటర్ల దూరంగా ఉన్న గ్రామాల్లో ఇళ్లస్థల పట్టాలు కేటాయించారు. వందలాది ఎకరాల్లో మెరక పనులు చేయించకుండా గత వైసీపీ ప్రభుత్వం గడిపేసింది. జిల్లావ్యాప్తంగా 296జగనన్న లేఅవుట్ల ఐడీ నెంబర్లతో మెరక పనులు చేయించారు. వాటికి సంబంధించి గత ప్రభుత్వం జిల్లాలో రూ.26కోట్లు బిల్లు బకాయిలు పెట్టింది.

లేఅవుట్లలో మెరక పనులపై దృష్టి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో మెరక పనులపై క్వాలిటీ కంట్రోల్ బృందాలను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆ బృందాలు సర్వే పూర్తిచేసిన తర్వాత అసలు ఎంత మేర పనులు జరిగాయో నిర్ధారించుకున్న తర్వాతే ప్రభుత్వం బిల్లులు చెల్లించే అవకాశం ఉందని ఆశాఖ అధికారులు చెప్తున్నారు. దానికితోడు ప్రస్తుతం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జగనన్న లేఅవుట్లలో పట్టాలు పొందిన లబ్ధిదారుల పునఃపరిశీలన కార్యక్రమం ఆన్‌లైన్‌లో చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన గ్రామీణ ప్రాంతాల నిరుపేదలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామని ప్రకటించింది. వైసీపీప్రభుత్వం సెంటున్నర స్థలానికి రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వడంతో మరోసారి నష్టపోయామని అర్హులైన నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థలాలు చూపలేదు

గత ప్రభుత్వం ఇళ్లస్థల పట్టాలు ఇచ్చి లక్షలాది రూపాయల ఆస్తిని సమకూర్చినట్టు నిరుపేదలను నమ్మించి మెరక పనులు చేయకుండా మోసం చేసింది. ఈసారైనా న్యాయంచేయాలని పేదలు వేడుకుంటున్నారు. పట్టాలకు సంబంధించి ఇళ్లస్థలాలను చూపిస్తే ఏదొకటి కట్టుకుంటామని వాపోతున్నారు. ఒక్క అమలాపురం రూరల్ మండలంలోనే 5,526మందికి ఇళ్లస్థలపట్టాలు ఇస్తే 3490 మందికి ఇంతవరకు ఇంటి స్థలాలను చూపించలేకపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోను ఈ పరిస్థితి నెలకొంది.

మెరక పనుల బకాయి రూ.26కోట్లు

ఇళ్లస్థలాలకు సేకరించిన భూములను మెరక చేసేందుకు అవసరమైన మట్టికి కొరత లేదు. కానీ మట్టి తరలింపు నిబంధనలతోనే అసలు సమస్య అని అధికారులు వాపోతున్నారు. మట్టి తరలింపులో గత ప్రభుత్వ హయాంలో ఎన్నోఅక్రమాలు జరిగాయి. మెరక పనులను తొలుత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించారు. అప్పట్లో జరిగిన పనులకు కొంతమేర బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం జిల్లాలో మెరక పనులకు రూ.26కోట్లు బకాయిలు విడుదల కావాల్సి ఉంది.

చిత్రవిచిత్రంగా ఇళ్లస్థల భూములు..

జిల్లాలో శ్మశానవాటికలు,వరదలొస్తే పొంగి ప్రవహించే మేజర్ డ్రెయిన్లు, గోదావరి తీరంలోను ఇలాఎక్కడపడితే అక్కడ గతప్రభుత్వం ఇళ్లస్థల పట్టాలు మంజూరుచేశారు. అమలాపురంరూరల్ మండలంలోనే పేదలకు ఇచ్చిన ఇళ్లస్థల పట్టాభూముల్లో చిత్రవిచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో జగనన్న కాలనీలకోసం తొలుత 24 లేఅవుట్లు ప్రకటించారు. గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ఇళ్లస్థల భూములతో కలిపి ప్రభుత్వం సేకరించిన భూములతో వెరసి 76.48 ఎకరాల్లో ఇళ్లస్థలాల లేఅవుట్లు వేశారు. అమలాపురం పట్టణానికి సంబంధించి నిరుపేదల కోసం మండలంలోనే మరికొన్ని లేఅవుట్లు వేసేందుకు భూములు సేకరించారు. వీటిలో 80ఎకరాల వరకు మెరక పనులకు నోచుకోలేదు. మండలానికి సంబంధించి చివరకు 22 లేఅవుట్లను మిగిల్చారు. అమలాపురం రూరల్ మండలానికి సంబంధించి 39 లేఅవుట్లలో 5526మందికి ఇళ్లస్థల పట్టాలు మంజూరుచేశారు. వారిలో 3490 మందికి ఇప్పటివరకు వారికి ఎక్కడ ఇంటి స్థలం కేటాయించారో చూపించలేదు.

రోడ్డు మార్గం లేక..

ఇమ్మిడివరప్పాడులో ఇళ్లస్థల పట్టాభూముల్లో వింతపరిస్థితి నెలకొంది. ఇక్కడ పట్టాలు పొందిన లబ్ధిదారులు 95శాతం శంకుస్థాపనలు చేసుకున్నారు. కానీ, ఒక్కఇళ్లూ నిర్మించలేదు. ఎందుకంటే అక్కడకు వెళ్లేందుకు దారిలేదు. దారీతెన్నూ లేని అక్కడకు 15కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈదరపల్లికి చెందిన పేద లబ్ధిదారులకు ఇళ్లస్థలపట్టాలుగా ఇచ్చారు.

ఈదరపల్లిలో శ్మశానవాటిక చెంతన మత్స్యశాఖ అధీనంలోని 1.70ఎకరాల్లోఉన్న చెరువులను 64మందికి పట్టాలుగా ఇచ్చారు. వెంటనే మెరక పనులు పూర్తి చేశారు. చకచకా స్టోన్లు ప్లాంటేషన్ చేశారు. ఇక ఇళ్ల నిర్మాణమే తరువాయి అన్న సమయంలో మత్స్యశాఖ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించడంతో ఆ భూములు నిరుపయోగంగా మారాయి.

బండారులంకలో నిరుపేదల కోసం స్థానిక అప్పర్ కౌశిక మేజర్ డ్రెయిన్ చెంతన పది ఎకరాల భూమిని సేకరించారు. ఆ స్థలంలో 383మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు. తమ ఇళ్ల స్థలాలను చూపించాలని గ్రామస్తులు పలు సార్లు ఆందోళనలు చేశారు.

జనుపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న 1.26 ఎకరాల మందబయలు భూమిని 49మందికి ఇళ్లస్థల పట్టాలుగా ఇచ్చారు. చెరువుగా ఉన్న వాటిని మెరక చేయడం ఇప్పట్లో సాధ్యమయ్యే పనే కాదు. స్థానికులు తమకు ఇళ్లస్థలం చూపించాలని కలెక్టర్ కార్యాలయంలో పలుసార్లు అర్జీలు అందించారు. వారికి తాండవపల్లి, గూడాల లేఅవుట్లలో ఇళ్లస్థలాలు కేటాయిస్తామని మాట ఇచ్చారు తప్ప ఇంతవరకు చర్యలు చేపట్టలేదు.

వంతెన అప్రోచ్ రోడ్లు త్వరగా చేపట్టాలి: కలెక్టర్

అమలాపురం,జూలై 30(ఆంధ్రజ్యోతి): అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, పురపాలక సంఘాలు సంయుక్త ఆధ్వర్యంలో ఈదరపల్లి వంతెనకు ఇరువైపులా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సుందరీకరణ పనులు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. ఆర్అండ్‌బీ, మున్సిపల్, ఏపీఈపీడీసీఎల్ ఇంజనీర్లతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు.ఈదరపల్లివద్ద ఇటీవల కొత్తగా వంతెన నిర్మించిన దృష్ట్యా ఎగువ, దిగువ సుందరీకరణ పనుల పురోగతిపై సమీక్షించారు. అప్రోచ్‌రోడ్ల నిర్మాణాన్నివేగవంతం చేయాలని ఆదేశించారు. వంతెనకు ఇరువైపులా అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై దృష్టిసారించాలి

» ఎయిడ్ కంట్రోల్ సొసైటీ పథక సంచాలకుడు నీలకంఠారెడ్డి

అమలాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణా చర్యలు అన్నీ పారామీటర్ల నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పథక సంచాలకుడు డాక్టర్ కె.నీలకంఠారెడ్డి ఆదేశించారు.హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై వైద్యసిబ్బందితో బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. డీఆర్వో బి.రాజకుమారి సమావేశానికి అధ్యక్షత వహించారు. నీలకంఠారెడ్డి మాట్లాడుతూ 2017-చట్టం హెచ్ఐవీతో బాధపడేవారికి రక్షణ కవచంగా ఉందన్నారు.ఎయిడ్స్ నియంత్రణలో ముందంజలో ఉండాలన్నారు. జిల్లాలో ప్రతి మూడునెలలకు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేస్తూ ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని అరికడుతూ మరణాల రేటును తగ్గించాలన్నారు. డీఎంహెచ్‌వో దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ కార్తీక్, అదనపు డీఎంహెచ్‌వో, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి భరతలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా 15 డెంగ్యూ, రెండు మలేరియా కేసులు

» ముందస్తు నివారణ చర్యలతో తగ్గిన వ్యాధి తీవ్రత
» డీఎంవో పరిధిలోకి 170మంది హెల్త్ అసిస్టెంట్‌లు
» నేడు మలేరియా సబ్‌యూనిట్‌ల్లో డెంగ్యూ మాసోత్సవాల ముగింపు
» జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరావు



నరేంద్రపురం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న వెంకటేశ్వరావు

పి.గన్నవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో 15 డెంగ్యూ, రెండు మలేరియా కేసులు నమోదయ్యాయని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ముందస్తు నివారణచర్యలతో గతంతో పోలిస్తే కేసులు సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆయన వివరించారు. డెంగ్యూ వివిధ మండలాల్లో నమోదు కాగా మలేరియా కేసులు మాత్రం ఊబలంక, ఎస్.యానంగ్రామాల్లో నమోదయ్యాయని తెలిపారు. డెంగ్యూ మాసోత్సవాలు ముగింపు సందర్భంగా మండలంలోని నరేంద్రపురం గురుకుల పాఠశాలతోపాటు పి.గన్నవరం సీహెచ్‌సీని పరిశీలించి అనంతరం మాట్లాడారు. కీటకజనిత వ్యాధులు నివారణకు జిల్లావ్యాప్తంగా ఉన్న 170మంది హెల్త్ అసిస్టెంట్‌లను ప్రభుత్వం డీఎంవో పరిధిలోకి తీసుకువచ్చిందని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్‌లను రెండు సచివాలయాలకు ఒక్కరి చొప్పున నియమించారన్నారు. వీరు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలున్న చోట ఎనాఫిలస్, ఈడీస్ దోమలు ద్వారా వచ్చే లార్వాలను గుర్తించి నాశనం చేయడంతోపాటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. రాజోలు, మండపేట, అమలాపురం, కొత్తపేట మలేరియా సబ్‌యూనిట్‌ల పరిధిలో హెల్త్‌అసిస్టెంట్‌లకు నెలకు ఒకసారి రివ్యూ సమావేశాలు నిర్వహించి గ్రామాల్లో పరిస్థితిని డీఎంవో కార్యాలయానికి నివేదిక అందిస్తారన్నారు. గురువారం డెంగ్యూ మాసోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాలోని నాలుగు సబ్‌యూనిట్‌ల పరిధిలో ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మండపేట మున్సిపాలిటీ కమిషనర్ ఆధ్వర్యంలో 1000 మందితో ర్యాలీ నిర్వహణకు భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. తొలుత పి.గన్నవరం ఆయన సీహెచ్‌సీలోని సూపరింటెండెంట్, రక్తపరీక్షల ల్యాబ్‌ను పరిశీలించి డెంగ్యూ, మలేరియా వ్యాధుల నిర్ధారణ పరీక్షలు క్రమం తప్పకుండా జరిపించాలని టెక్నీషియన్లకు సూచనలు చేశారు. నరేంద్రపురం గురుకుల పాఠశాలను సందర్శించి పరిసరాల్లో ఎనాఫిలస్, ఈడీస్ దోమలకు సంబంధించి లార్వాను గుర్తించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి దోమలద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

దేవస్థానం భూముల మట్టి తరలిస్తే చర్యలు

» అంతర్వేది ఆలయ ఏసీ



అంతర్వేదిలో గుట్టలుగా పేర్చిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూముల మట్టి

అంతర్వేది, జూలై 30(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించి భూముల్లో మట్టిని గుట్టలుగా పేర్చడంతో ఆలయ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అప్పటికే భూముల్లో గుట్టలుగా పేర్చిన మట్టిన తరలించేందుకుప్రయత్నాలు సాగుతున్నాయన్న సమాచారంతో అంతర్వేది రాపాకవారి గ్రూపులోని ఇసుక గుట్టలను పరిశీలించారు. వాటిలో కొంత మట్టిని దేవస్థానం ఆలయానికి తరలించారు. స్వామివారి దేవస్థానం భూముల్లోని మట్టిని గుట్టలుగా పేర్చినట్టు సమాచారం అందిస్తే వెంటనే ఆ మట్టిని స్వాధీన పరుచుకుంటామని ఆలయ ఏసీ వరప్రసాద్ పేర్కొన్నారు. దేవస్థానంలో ఎటువంటి కట్టడాలు, మట్టి తరలింపు వంటి వాటిని నిర్వహించినా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నదీకోతతో భూములు నదీగర్భంలో కలిసిపోతున్నాయి

» అప్పనపల్లివాసుల ధర్నా

మామిడికుదురు, జూలై 30(ఆంధ్రజ్యోతి): నదీకోతవల్ల తమ విలువైన భూములు నదీగర్భంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ అప్పనపల్లి వాసులు బుధవారం కోత జరుగుతున్న ప్రాంతంలో ధర్నా చేశారు. విలువైన తోటలు, సారవంతమైన భూములతోపాటు నివాస గృహాలు నదీ కోతవల్ల నదీ గర్భంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఏటా వరదల సమయంలో విలువైన భూములు కోతకు గురై గోదావరిలో కలిసిపోతున్నాయని ఆరోపిస్తూ ఈ ధర్నా చేశారు. వెంటనే నదీకోతను నివారించితమ విలువైన భూములు, ఇళ్లను కాపాడాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాటి గోవిందరావు, శ్రీనివాస్, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డు నిర్మాణం



ఆలమూరు మండలం చెముడులంక వద్ద రోడ్డు సర్వే నిర్వహిస్తున్న అధికారులు

» చెముడులంక వద్ద హైవేపై సర్వే
» వేగంగా పనులు చేపడుతున్న అధికారులు

ఆలమూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడలంకవద్ద జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డునిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి హైవే అధికారులు సర్వేచేస్తున్నారు. హైవే పొడవునా చెముడులంక గ్రామం విస్తరించి ఉంది. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున సర్వీసు రోడ్డు నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నారు. పాతికేళ్ల క్రితం రెండు లైన్లు ఉన్న జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించే సమయంలోనే సర్వీసు రోడ్డు, డ్రైన్‌కు సంబంధించిన భూసేకరణ చేశారు. అప్పటినుంచి సర్వీసు రోడ్డునిర్మాణం జాప్యం జరుగుతూ వచ్చింది.ఇప్పుడు ఈరోడ్డు నిర్మాణానికి సంబంధించి అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్ల మార్పునకు అవసరమైన ఖర్చును ఇప్పటికే చెల్లించారు. త్వరలోనే పట్టణాల మాదిరిగా పొడవైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేయడానికి విద్యుత్‌శాఖ చర్యలు చేపడుతోంది. మరో పదిరోజుల్లో ఈ విద్యుత్‌లైన్ల మార్పు పనులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇక డ్రైనేజీకి సంబంధించిన కొన్ని ఆక్రమణలను తొలగించాల్సి ఉంది. వీటికి నష్టపరిహారం చెల్లించి ఉన్నందున ప్రస్తుతం హైవేకి సంబంధించిన భూమి ఎంత ఉన్నది అనేది నిర్ధారిస్తున్నారు. తదుపరి ఆక్రమణలు తొలగించి వచ్చేనెలలోనే డ్రైనేజీ పనులు చేపడతామని హైవే ప్రతనిధులు చెబుతున్నారు. ఇప్పటికే ఈగ్రామం పొడవునా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ఉన్నారు. ఇప్పుడు డ్రైనేజీ, సర్వీసు రోడ్డు నిర్మిస్తే ఆ గ్రామంలో ప్రమాదాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

డివైడర్ ఏర్పాటు చేయాలి

ఆలమూరు మండలం చెముడులంక వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చెముడులంక వద్ద కాలువ దాటేందుకు పెద్ద వంతెన లేనందున నాలుగులైన్ల రోడ్డు నిర్మాణ సమయంలో డివైడర్ సౌకర్యం కల్పించలేదు. దీంతో పలుచోట్ల అనధికార డివైడర్లు ఏర్పాటు చేసుకుని రోడ్లు దాటుతున్నారు. దీనివల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. చెముడులంకవద్ద నూతనంగా కాలువపై పెద్ద వంతెన నిర్మించడంతో ఈ గ్రామం నుంచి బడుగువానిలంక వెళ్లేందుకు అనువుగా అధికారంగా డివైడర్ ఏర్పాటు చేయాలని లంక గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఈ సర్వీసు రోడ్డు నిర్మాణంలోనైనా డివైడర్‌ను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు నివారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం
» మంత్రి సుభాష్
7
పేలిన గ్యాస్ సిలిండర్
» భీమక్రోసుపాలెంలో ఘటన

మేధస్సుకు పరీక్ష



- విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
- శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా కేంద్రం ప్రోత్సాహం
- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్'కు దరఖాస్తుకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు అవకాశం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30 వరకు గడువు



అమలాపురంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, అధికారులు

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడంతోపాటు శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచి పరిశోధనల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపరీక్షను ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వారికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దేశ ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్, ఉపకార వేతనాలు పొందే అవకాశం ఉంది.

సెప్టెంబరు 30 వరకు రిజిస్ట్రేషన్

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశపరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబరు 30 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు గడువు ఉంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాలస్థాయిలోనే నిర్వహిస్తారు. పరీక్ష జరిగేరోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, లాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒకదాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన దరఖాస్తును ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది.

రెండు విభాగాల్లో పరీక్ష..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు విడివిడిగా ఈ పరీక్ష నిర్వహిస్తారు. హిందీ, ఇంగ్లీషు భాషలతోపాటు దేశవ్యాప్తంగా ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాసుకునే వెసులుబాటు ఉంది. మన విద్యార్థులు తెలుగు లేదా ఇంగ్లీషు భాషల్లో రాయవచ్చు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షకు సంబంధించి సెప్టెంబరు 1 నుంచి మాక్ పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాలస్థాయిలో ప్రధాన పరీక్ష అక్టోబరు 28 నుంచి 30 వరకు జరుగుతుంది. ఈ స్థాయిలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 ద్వితీయ పరీక్షను ఆన్‌లైన్‌లో ప్రోక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబరు 19న జరుపుతారు. ఆయా పరీక్షలను ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 90 నిమిషాల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి యాప్‌లో ఒక్కసారి మాత్రమే లాగిన్ అవుతారు.

వంద మార్కులకు పరీక్ష

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. లెవెల్-1 ప్రధాన పరీక్షలో ఆయా తరగతులకు సంబంధించిన వంద ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద మార్కులు కేటాయిస్తారు. సెక్షన్-ఏలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషిపై 20ప్రశ్నలు, సత్యేంద్రనాథ్‌బోస్ జీవితచరిత్ర నుంచి 20ప్రశ్నలు, సెక్షన్-బీలో 6 నుంచి 11 తరగతులకు సంబంధించి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజిక్, రీజనింగ్ బుక్‌కు సంబంధించి 10ప్రశ్నలు ఉంటాయి. మొదటి విభాగంలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 ద్వితీయ పరీక్షలో 50 ప్రశ్నలు వంద మార్కులకు ఉంటాయి.

రాష్ట్రస్థాయికి ఎంపిక చేసేదిలా..

పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 25మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి 11 తరగతులకుగాను మొత్తం 150మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయి పరీక్ష డిసెంబరు 21, 28 తేదీల్లోగానీ జనవరి 4నగానీ ఏదో ఒకరోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతినుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతోపాటు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థులు వంతున 12మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18మందిని జాతీయస్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయస్థాయి విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలతోపాటు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. నెలకు రూ.2వేల చొప్పున సంవత్సరంపాటు భాస్కర ఉపకార వేతనం కింద, రూ.24వేలు అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్‌స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థల్లో ఒకటినుంచి మూడువారాలపాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

సృజనాత్మకతను వెలికితీయొచ్చు

-జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి



విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ చక్కటి వేదికగా నిలుస్తుంది. సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించడంతో పాటు వారిని శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ పరీక్షను ప్రభుత్వ, ఇతర యాజమాన్య ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా రాసుకునే అవకాశం కల్పించారు.

పాఠశాలనుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు

-షేక్ సలీంబాషా, డీఈవో, కోనసీమ జిల్లా



విద్యార్థులు వ్యక్తిగతంగానే కాకుండా పాఠశాల నుంచి కూడా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పరీక్ష రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. www.vvm.org.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పాఠశాలస్థాయినుంచి పెంపొందించుకునేందుకు పరీక్ష దోహదపడుతుంది.



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ప్రాక్టీస్‌లో పాల్గొన్న హాకీ క్రీడాకారులు

మహా క్రీడా సంబరానికి సర్వం సిద్ధం

- కాకినాడలో రేపటి నుంచి 15వ హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలు
- 1నుంచి 12 వరకు మ్యాచ్‌లు
- పాల్గొననున్న 30 రాష్ట్రాల జట్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మహా క్రీడాసంబరానికి, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఇలా రెండు ప్రధాన కార్యక్రమాలకు కాకినాడ ముస్తాబవుతోంది. ఆగస్టు 1వతేదీ నుంచి 12 వరకు కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరిగే 15వ హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆగస్టు 3 నుంచి 20 వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ర్యాలీ, వివిధ సామర్థ్య పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తున్నారు.

పూర్తికావొచ్చిన ఏర్పాట్లు

జాతీయస్థాయి మహిళల జూనియర్ హాకీ పోటీలకు 30 స్టేట్ టీమ్స్ పాల్గొననున్నాయి. ఇప్పటికే కొన్ని టీమ్‌లు కాకినాడ చేరుకున్నాయి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ ఉండడంతో గతంలో రెండుసార్లు జాతీయ పోటీలు ఇక్కడ విజయవంతంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు, డీఎస్‌డీవో శ్రీనివాస్ నెలరోజులుగా ఈ పోటీల నిర్వహణ ఏర్పాట్ల కోసం శ్రమిస్తున్నారు. వచ్చేక్రీడాకారులకు ఏడుచోట్ల వసతి ఏర్పాట్లు చేశారు. క్రీడల నిర్వహణకు 38మంది జిల్లా విద్యాశాఖ పీడీలను ఏర్పాటు చేశారు. ప్రతి జట్టుకు 18మంది క్రీడాకారులు ఉంటారు. మెడికల్, మున్సిపాలిటీ, రెవెన్యూ, డీ ఎస్‌ఏ సిబ్బంది కలిపి 200మంది వరకు సేవలందించనున్నారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో..

మహిళల హాకీ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరగనున్నాయి. సీ డివిజన్, బీ డివిజన్, ఏ డివిజన్ ఇలా వరుసగా పోటీలు నిర్వహిస్తారు. 12న హాకీ ఇండియా హయ్యర్ అఫీషియల్స్ రానున్నారు. రోజుకు 8మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు షెడ్యూల్ ప్రకారం పోటీలు జరుగుతాయి.

హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం

హాకీఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో,ఏపీ స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా ఆగస్టు 1 నుంచి నిర్వహించే జాతీయస్థాయి హాకీ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈ పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి, శాప్ చైర్మన్ ఈ పోటీలను ప్రారంభించనున్నారు. ఈ పోటీల ద్వారా జూనియర్ వరల్డ్‌కప్ ఉమన్ హాకీ టీమ్‌ను ఎంపిక చేస్తారు.

-రవిరాజు, సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర హాకీ అసోసియేషన్

ఏయే డివిజన్‌లో ఏయే టీమ్‌లు

డివిజన్-'ఏ'..

డివిజన్-'ఏ'లో.. నాలుగు పూల్స్ ఉంటాయి.
పూల్-ఏ: జార్ఖండ్, ఛత్తీస్‌ఘర్, కర్నాటక
పూల్-బీ: మధ్యప్రదేశ్,పంజాబ్, చండీఘర్
పూల్-సీ: హర్యానా, ఉత్తరప్రదేశ్, బెంగాల్,
పూల్-డీ: ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్

డివిజన్-'బి'..

డివిజన్ 'బి'లో రెండు పూల్స్ ఉంటాయి
పూల్-ఏ: మణిపూర్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్, కేరళ, అస్సాం
పూల్-బీ: హిమాచల్, ఢిల్లీ, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, బీహార్

డివిజన్-'సి'..

డివిజన్-సీలో రెండు పూల్స్ ఉంటాయి.
పూల్-ఏ: దాద్రానగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, జమ్మూ అండ్ కశ్మీర్, గోవా, త్రిపుర జట్లు
పూల్-బీ: గుజరాత్, రాజస్థాన్, మిజోరం, తెలంగాణ

హాకీ క్రీడాకారులకు వసతి కేంద్రాలు

క్రీడాకారుల కోసం ఏడుచోట్ల వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సామర్లకోటలోని ఈటీసీ శిక్షణకేంద్రం, సర్వే ట్రైనింగ్ అకాడమీ, టీటీడీసీ క్యాంపస్, కాకినాడ బాలాజీచెరువు సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ హాస్టల్ భవనం, జేఎన్‌టీయూకే ఉమెన్స్ హాస్టల్, అశోక్‌నగర్‌లోని జీపీటీ హాస్టల్, శ్యామ్ ఇనిస్టిట్యూట్, అచ్చంపేటలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్‌ల్లో వారికి ఏర్పాట్లు ఉన్నాయి.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ఆగస్టు 3 నుంచి 20 వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు 12జిల్లాల నుంచి అభ్యర్థులు ఈ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొననున్నారు. ఇప్పటికే ఆర్మీ ఎంపిక పరీక్ష రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ ఇక్కడ జరగనుంది. రోజుకు 800మంది ఈ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటారు. అభ్యర్థులకు ముందుగా నెంబర్లు కేటాయించి 100మంది చొప్పున 1.6 కె.ఎం రన్నింగ్ పరీక్ష, అనంతరం మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. 20రోజుల పాటు జరిగే ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో 15వేలమంది పాల్గొనే అవకాశం ఉంది. ఆర్మీ అభ్యర్థులకు స్పోర్ట్స్ అధారిటీ ఆవరణలోనే వసతి కల్పించనున్నారు. ఆగస్టు 5 నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రారంభం కానుంది.





హమ్మయ్య... గొంతు తడిసింది!

దాహార్తితో ఉంటే కళ్లెదుట ఏ నీరు కనిపిస్తే అదే అమృతం. అది మనుషులకైనా, జంతువులైనా. ఇక్కడ కనిస్తున్న దృశ్యం అదే విషయాన్ని ఆవిష్కృతం చేసింది. దాహంతో అలమటిస్తున్న ఆవుకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌లోని ఓవర్‌హెడ్ రిజర్వాయర్ పైపు నుంచి కారుతున్న నీటి ధార కనిపించింది. అక్కడకు చేరుకుని పైపు నుంచి వచ్చే నీటితో నాలుక తడుపుకుంది. బుధవారం సాయంత్రం కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

... గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)


లడ్డు ప్రసాదాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు నందాజీ, రామయ్య

వాడపల్లి వెంకన్న ఆలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఆత్రేయపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఉభయ గోదావరి జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బీవీబీ నందాజీ, జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై.రామయ్య లడ్డు, పులిహోర తయారీ కేంద్రాలను పరిశీలించారు. అన్నదాన సత్రంలో అన్నప్రసాదం తయారీతో పాటు అక్కడ సౌకర్యాలను చూశారు. లడ్డు, పులిహోర ఎలా ఉంటున్నాయని భక్తులను ఆరా తీశారు. జల ప్రసాదం ఆర్వో ప్లాంటును పరిశీలించారు. అనంతరం అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో చక్రధరరావు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.


అన్న ప్రసాదం ఎలా ఉందని భక్తుడిని అడిగి తెలుసుకుంటున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు. చిత్రంలో ఈవో సూర్యచంద్రరావు

చట్టసభల్లో వాటా కోసం యాదవులంతా ఏకమై
పోరాటం చేయాలి

జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య పిలుపు


అఖిల భారత యాదవ సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ జగన్నాథపురంలోని గొల్లపేట యాదవ కమ్యూనిటీ హాలులో బుధవారం ఉమ్మడి జిల్లా సంఘ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య మాట్లాడుతూ ఐక్యతతో ఎటువంటి హక్కులనైనా సాధించుకోగలమన్నారు. చట్టసభల్లో వాటాకోసం యాదవులంతా ఏకమై పోరాటం సాగించాలన్నారు. రాజ్యాధికారం దక్కినప్పుడే ఆర్థికంగా, రాజకీయంగా యాదవులు ఎదుగుతారన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా యనమల రాజేష్, మన్నే కాశీవిశ్వేశ్వరరావు, అధ్యక్షుడిగా మన్నే నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గింజాల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అందరినీ కలుపుకుని యాదవుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రమేష్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల చైర్మన్ గొరుపర్తి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని, రాష్ట్ర కార్యదర్శి కుప్పం రవిశంకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీర్ల వెంకట సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి చాట్ల మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ సెజ్‌ల్లో ఉద్యోగుల నివాస గృహాలకు స్థలాలు కేటాయించాలి

లోక్‌సభ జీరో అవర్‌లో ప్రస్తావించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఐటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంటు సమావేశాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ గళమెత్తారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లో ఐటీ ఉద్యోగులకు ప్రత్యేకంగా నివాస గృహాల కోసం స్థలాలు కేటాయించాలని కోరారు. లోక్‌సభలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఐటీ సేవల ఎగుమతుల్లో ప్రపంచంలోనే మన దేశం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. 2005లో 23 బిలియన్ డాలర్లు కాగా 2025 నాటికి 200 బిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. 50లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. బెంగళూరు, హైదరాబాద్, గుర్గావ్, పూణే, చెన్నై నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. అక్కడ పనిచేసే ఉద్యోగులకు నివాసం పెను సమస్యగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఐటీ ఉద్యోగులకు గృహాల నిర్మాణానికి స్పష్టమైన జాతీయ మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీ కోరారు.



కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంస్థ అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని కాకినాడ జిల్లా పిఠాపురంలో ఏర్పాటు చేయాలని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి కనుమూరి శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి

- డెల్టా కాలువలకు పెరిగిన నీటి విడుదల
- 661 టీఎంసీల నీరు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలి ఆర్మ్‌లోని మొత్తం గేట్ల 1.5 మీటర్లు, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌ల్లోని మొత్తం గేట్లను ఒక మీటరు మేర పైకి ఎత్తి 5,14,117 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10 అడుగులుగా నమోదైంది. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 31.2 అడుగులకు చేరుకుంది.

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వరినాట్లు ప్రారంభమైన దశలో వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 4,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కులు చొప్పున మొత్తం 14,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గోదావరికి వరద సీజను ప్రారంభమై జూన్, జూలైల్లో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి మొత్తం 661.82 టీఎంసీలను సముద్రంలోకి వృథాగా వదిలి వేశారు. జూన్‌లో వచ్చిన నీరు వ్యవసాయ అవసరాలకు పోను 10 టీఎంసీల మేర సముద్రంలోకి ప్రవహించింది. జూలైలో గోదావరికి రెండుసార్లు ఎగువ నుంచి 6లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం తరలివచ్చింది. ఒక మోస్తరుగా తరలివచ్చిన వరదకే 650కిపైగా టీఎంసీలు సముద్రంలోకి పోయింది. ఈ నీటితో 60లక్షల ఎకరాలకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించవచ్చు.




మేఘ సందేశం!

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని గోదావరి నదిపై... కోటిలింగాల రేవు వద్ద బుధవారం సాయంత్రం మబ్బులు ఇలా అందంగా కమ్ముకున్నాయి. వీటిని చూసినవారికి ఎండను తగ్గించి చల్లని వాతావరణం ఇచ్చేందుకు వచ్చాం అనే సందేశం ఇచ్చినట్టు అనిపిస్తుందంటే అతిశయోక్తి కాదేమో.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

సత్యదేవుడి హుండీల ఆదాయం
రూ.1.57 కోట్లు


హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,57,09,001 నగదు, 35 గ్రాముల బంగారం, 659 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటుగా యూఎస్ఏకు చెందిన 125 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్స్, సింగపూర్ 30 డాలర్లు, యుఏఈ 90 దిరహమ్స్, రష్యన్ 50 రూబీలు లభించాయి. లెక్కింపును ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. 35 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.4.48 లక్షల ఆదాయం హుండీలలో భక్తులు సమర్పించుకున్నారు.

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం


ఫైల్‌ఫొటో


లారీ చక్రాల మధ్యలో చిట్టిరాజు మృతదేహం

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్ల వ్యక్తి దుర్మరణం చెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కోటిలింగాలపేటకు చెందిన బత్తుల చిట్టిరాజు (52) గుమ్మళ్లదొడ్డిలోని పీఎంఏజే ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో మెకానికల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రోజూ మాదిరిగానే బుధవారం ఇంటి నుంచి ఆఫీస్‌కు మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన చిట్టిరాజును మార్గమధ్యంలో కొంతమూరు కళ్యాణ్‌నగర్ వద్ద అతివేగం, నిర్లక్ష్యంగా వస్తున్న టిప్పర్‌లారీ వెనుకవైపు నుంచి బలంగా ఢీకొని కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. చిట్టిరాజు లారీ చక్రాల మధ్యలో ఇరుక్కుపోయి నుజ్జునుజ్జయ్యి మరణించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లీల ఫిర్యాదుతో రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి


మృతిచెందిన జ్ఞానకుమార్

సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో భవనం పై పెయింట్ పనిచేస్తుండగా ప్రమాదపు శాత్తు కింద పడి వంగలపూడి గ్రామానికి చెందిన అల్లం సతీష్ జ్ఞానకుమార్ (46) మృతిచెందాడు. సీతానగరం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం చినకొండేపూడిలో అడపా తిరుపతిరావు ఇంటి పై అంతస్తుకు ఫరంజీలు కట్టుకుని దానిపై నిలబడి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు ఫరంజి తెగిపోవడంతో పై నుంచి రోడ్డుపై పడి జ్ఞానకుమార్ తలకు తీవ్ర గాయమైంది. తోటి పనివారు కుటుంబ సభ్యులకు తెలియపరిచి చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. జ్ఞానకుమార్ భార్య అల్లం దేవి భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

పేలిన గ్యాస్ సిలిండర్

భీమక్రోసుపాలెంలో వ్యక్తి పరిస్థితి విషమం

ద్రాక్షారామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెంలో మంగళవారం రాత్రి అనిశెట్టి సుబ్బలక్ష్మీ ఇంటి స్టోర్‌రూమ్‌లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఫైర్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో అనిశెట్టి సుబ్బలక్ష్మీ చెందిన ఇంటి వంటగదికి చేర్చి మేడమెట్ల కింద స్టోర్‌రూమ్‌లో విద్యుత్‌మీటరు, కట్టెల పొయ్యి ఉంది. గదిలో కట్టెలు, పూర్తి గ్యాస్ నిండి ఉన్న అదనపు సిలిండర్ ఉన్నాయి. రాత్రి 11 గంటల ప్రాంతంలో స్టోర్ రూమ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్నవారు కేకలు వేయడంతో ఇంట్లో నుంచి సుబ్బలక్ష్మీ, కుటుంబీకులు బయటకు వచ్చేశారు. మంటల్లో గ్యాస్ సిలిండర్ ఉండటంతో ఒక్కసారిగా పేలిపోయింది. వారికి సాయం చేసేందుకు వెళ్లిన పితాని చినబాబు తీవ్రంగా గాయపడ్డాడు. అగ్నిమాపకదళ అధికారి కె.వెంకటరెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చినబాబును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెప్తున్నారు. పేలుడు ధాటికి ఇంటి వంటగది గోడలు ధ్వంసమై మేడమెట్లు కూలిపోయాయి. రూ.2 లక్షల నష్టం సంభవించినట్టు చెప్తున్నారు.


సిలిండర్ పేలుడుకు ధ్వంసం అయిన ఇంటి గోడలు

చెరువులో పడి వ్యక్తి మృతి



జగ్గంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మంచి నీటి చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట టవర్ కాలనీకి చెందిన ఇల్ల డేవిడ్‌రాజ్ (40) పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య సిబ్బందిగా పని చేస్తున్నాడు. మద్యం తాగి చెరువులో పడిపోవడంతో మృతి చెందాడని స్థానికులు తెలిపడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చింతూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. బుధవారం తమకు అందిన సమాచారం మేరకు అల్లూరి జిల్లా చింతూరు మండలం కల్లేరు సీలేరు నది ఒడ్డున మృతదేహం ఉన్నట్టు గుర్తించామన్నారు. మృతదేహంపై గులాబీ రంగు టీషర్టు, బూడిద రంగు షార్ట్ ఉన్నాయని.. మృతుడికి 30 నుంచి 35 ఏళ్లు ఉండవచ్చన్నారు. కేసు నమోదు చేశామన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే చింతూరు పోలీసు స్టేషన్లో సంప్రదించాల్సిందిగా ఎస్ఐ కోరారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

63 గ్రాముల బంగారం స్వాధీనం

అన్నవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఈఏడాది జనవరి నెలాఖరున జరిగిన రెండు వేర్వేరు చోరీ కేసుల్లో నిందితులను బుధవారం అన్నవరం ఎస్ఐ హరిబాబు కత్తిపూడిలో అరెస్టు చేశారు. నర్సీపట్నం మండలం కె.ఎల్ పురానికి చెందిన గెడ్డం రామ్ నవీన్, నర్సీపట్నంకు చెందిన మారి అలెక్స్ చెడు అలవాట్లకు బానిసై చోరీల బాటపట్టారని పేర్కొన్నారు. వారిని అరెస్ట్ చేసి 63 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. మరో నిందితుడు రౌతు మల్లేష్‌ను అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ హరిబాబు

కీచక కరస్పాండెంట్ అరెస్ట్


రాయవరం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ, సీఐ

రాయవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినిని బెదిరించి లోబర్చుకుని గర్భవతిని చేసిన కీచక స్కూల్ కరస్పాండెంట్ ఆకుమర్తి జయరాజ్‌ను అరెస్టు చేసినట్టు ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సోమేశ్వరం శివారు రెడ్డి కృష్ణమ్మపేటకు చెందిన ఆకుమర్తి జయరాజ్ రాయవరం మండలంలోని ఓ గ్రామంలో స్కూల్ నిర్వహిస్తున్నాడు. అదే స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న బాలికను ఈ ఏడాది మార్చి 26న తన ఆఫీసు రూమ్‌లోకి పిలిపించుకుని అలమారలో ఫైల్స్ తీయమని చెప్పాడు. తర్వాత నోరునొక్కి కేకలు వేస్తే చంపేస్తానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికకు నెలసరి రాకపోవడంతో ఈనెల 28న తల్లిదండ్రులు వైద్య పరీక్షలు చేయించగా గర్భవతి అని తేలింది. దీంతో బాలిక తల్లిదండ్రులు రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని బుధవారం రామచంద్రపురం మండలం కొత్తూరు శివారు జంక్షన్ వద్ద వీఆర్వో సమక్షంలో అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. నిందితుడిని అరెస్టు చేసిన ట్రైనీ డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ ఏవీఆర్‌బీ ప్రసాద్, డీఎస్పీ రఘువీర్ తదితరులు అభినందించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్ట్


రాజానగరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, సీఐ

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భార్యను విచక్షణా రహితంగా నాపరాయితో తలపై మోది కడతేర్చిన భర్తను రాజానగరం పోలీసులు అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొంతమూరు సంతోష్‌నగర్‌లో ఈ నెల 27న జరిగిన మహిళ హత్య కేసు వివరాలను రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ స్థానిక సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్‌తో కలిసి వెల్లడించారు. వేమగిరి ఉషారాణి అలియాస్ చిన్నారి(28)కి సుమారు పదేళ్ల కిందట నర్సీపట్నం దగ్గరలోని గిడుతురు గ్రామానికి చెందిన వేమగిరి మాణిక్యంతో వివాహం జరిగింది. వారికి కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. వివాహం అయినప్పటి నుంచి భార్య పిల్లలు కొంతమూరు సంతోష్‌నగర్‌లోనే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మాణిక్యం వెల్డింగ్ పనిచేసేవాడు. ఈనేపథ్యంలో ఉషారాణిపై అనుమానంతో మాణిక్యం తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ విషయమై నెలరోజుల కిందట రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో భార్యభర్తల గొడవ కేసు నమోదు చేశారు. ఉషారాణి కేసు పెట్టినప్పటీ నుంచి మాణిక్యం కుంటుంబాన్ని పట్టించుకోకుండా సరిగ్గా ఇంటికి రాకుండా అక్కడక్కడా తిరుగుతూ భార్యపై అనుమానం మరింత ఎక్కువ పెంచుకున్నాడు. దీంతో ఈ నెల 26న రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి నాపరాయితో ముఖంపై బలంగా కొట్టి హతమార్చి పరారయ్యాడు. ఈ మేరకు ఉషారాణి తల్లి నలమాటి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మాణిక్యంను 28న సాయంత్రం అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌తో పాటుగా ఎస్ఐ కెవి నాగార్జున, ఎస్ఐ నారాయణమ్మ, సిబ్బంది నరేష్‌బాబు, రాంప్రసాద్, అశోక్‌లను ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దొబ్బడి పెద్దిరాజు

నల్లజర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల డైట్ కళాశాలకు వెళ్లే మార్గం వద్ద ఓ చిన్న దుకాణం నడుపుతున్న దొబ్బడి పెద్దిరాజు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గత 15 ఏళ్లుగా ఇక్కడే పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం పంచాయతీ కార్యదర్శి ఆశ అలైఖ్య పోలీసు సిబ్బందితో ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసే ప్రయత్నం చేయగా తన జీవనాధారం పోతుందని ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కార్యదర్శి ఆశ అలైఖ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కొట్టు వద్ద చెట్టు ఉండడం వల్ల వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పాడుతుందని గ్రామానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేయడంతో అనేకసార్లు చెట్టు కొమ్మలను తొలగించాలని చెప్పినాపట్టించుకోలేదన్నారు. లైన్‌మెన్, పోలీసులు చెట్టును తొలగించేందుకు వెళ్లగా కొట్టు తీసేస్తున్నారని చెప్పి అబద్ధాలు చెప్పాడన్నారు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో మాధవరాయుడు పాలెంలో బొల్లా ధనుంజయ అలియాస్ డీజెఎస్‌పై డ్రింక్ సీసాతో దాడి చేసిన ముంజేటి సురేష్ అనే వ్యక్తిపై నేరం రుజువు కావడంతో ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.బెన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. 2024లో జరిగిన ఈ సంఘటనపై అప్పట్లో కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో సురేష్ ఈ దాడి చేసినట్టు అప్పటి సీఐ టి.కృష్ణసాయి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో సాక్షులను ప్రస్తుత కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ కే.శ్రీనివాస్ కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ కే.రాధాకృష్ణరాజు వాదన వినిపించారు. న్యాయమూర్తి తుది తీర్పును వెల్లడించారు. నిందితుడికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు.

మహిళను వేధించిన ఇద్దరిపై కేసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన కేసులో ఇద్దరిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన కే లక్ష్మి అనే మహిళకు ఈనెల 9న రాత్రి 11:30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఫోను చేసి బెదిరింపులకు గురిచేయ్యడమే కాకుండా వాట్సాప్ గ్రూప్‌లలో అసభ్యకరంగా వాయిస్ మెసేజ్‌లు పెట్టి అవమానించారని ఈనెల 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బొమ్మూరు పోలీసులు మునగాలకు చెందిన జీ.సుమంత్, పెద్దాపురానికి చెందిన ఎం.రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూడలపై కుక్కల దాడి

ఆలమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో కుక్కలు గేదె దూడలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచాయి. వీటిలో ఒకటి మృత్యువాత పడగా మరో రెండికి వైద్యం అందిస్తున్నారు. ఇలా అయితే పశువుల పెంపకం ఇబ్బందికరంగా మరుతుందని పెంపకందారులు అంటున్నారు. 2 రోజులుగా జరిగిన దాడుల్లో గాయపడిన దూడలకు ఆలమూరు ఏడీ ఎల్.అనిత ఆధ్వర్యంలో వైద్యులు భానుప్రకాష్ వైద్యం అందిస్తున్నారు


పెదపళ్లలో గాయపడిన దూడలను పరిశీలిస్తున్న వైద్యులు

కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

వడ్రంగి కార్పొరేషన్ ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : మంత్రి సుభాష్


వడ్రంగుల రాష్ట్ర స్థాయి సమావేశంలో ఐక్యత ప్రదర్శిస్తున్న మంత్రి, ప్రతినిధులు

అమలాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వడ్రంగుల సమస్యల పరిష్కారంలో భాగంగా వడ్రంగి కార్పొరేషన్ ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. ఏపీ కార్పెంటర్ అసోసియేషన్ 8వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సభ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని వాసర్ల గార్డెన్స్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ వడ్రంగి మేస్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని, ఏ కార్మికుడికి కష్టం వచ్చినా తనను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వడ్రంగి మేస్త్రీల అసోసియేషన్‌కు ఉమ్మడి జిల్లాలో భవనం ఉండేదని, కోనసీమలో కూడా భవనం మంజూరు చేయాలని వడ్రంగి అసోసియేషన్ చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేక కార్పొరేషన్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు నూతన అధ్యక్షుడు కమిటీ సభ్యులను ఎన్నుకుని మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాడికొండ రంగబాబు, ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా గానాల సత్యసాయితో పాటు నూతన కార్యవర్గాన్ని మంత్రి అభినందించారు.

గంజాయితో ఐదుగురి అరెస్టు

2.57 కిలోల గంజాయితో పాటు

మోటారు సైకిల్, రూ.1500 నగదు స్వాధీనం

సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నల్గొండ శివారున గంజాయితో ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ, శ్రీకాంత్ కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ పర్యవేక్షణలో సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ దాడి చేశారు. నల్గొండ శివారున గంజాయి రవాణా చేస్తున్న అదే గ్రామానికి చెందిన చింతల గంగరాజు, బండారు అప్పన్నదొర, తొర్రేడు గ్రామానికి చెందిన తాటిపాక గణేష్, కడియం మండలం మురమండకు చెందిన నేరుమిల్లి అఖిల్, సీతానగరం మండలం బొబ్బిల్లంకకు చెందిన పోలిన సాయి సతీష్‌ను నల్గొండ శివారు మామిడి తోటల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో సమక్షంలో ఐదు గంజాయి ప్యాకెట్లు, మోటారు సైకిల్, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు పోలీసులు పేర్కొన్నారు. గంజాయిని ఒడిస్సా ఏజెన్సీ ప్రాంతం నుంచి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయాలు చేస్తున్నట్టు వారు తెలిపారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

అమలాపురం

మలేరియా అధికారి పరిశీలన

అల్లవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): అల్లవరం సీహెచ్‌సీ పరిధిలోని పలు ప్రాంతాలను జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. తొలుత సీహెచ్‌సీని సందర్శించి జ్వరపీడిత కేసులు, మలేరియా, డెంగ్యూ కేసుల వివరాలు తెలుసుకున్నారు. లార్వా పెరుగుదల, నివారణపై అవగాహన కల్పించారు

పింఛన్ల సత్వర పంపిణీకి చర్యలు

అయినవిల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 1న పెన్షన్లు సత్వరం పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీవో సరోవరరావు తెలిపారు. బుధవారం మండలంలో సచివాలయాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉదయం 7గంటలనుంచి పెన్షన్లు పంపిణీచేయాలని ఆదేశించారు.



గొల్లగూడెం పీర్లపంజాలో మాట్లాడుతున్న మౌలానాసయ్యద్ తాహిర్

భక్తిశ్రద్ధలతో బీబీ సకీనా వర్ధంతి

● గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు

అమలాపురంటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త మనుమరాలు బీబీ సకీనా వర్ధంతిని అమలాపురం గొల్లగూడెం పీర్ల పంజాలో బుధవారం నిర్వహించారు. విశాఖపట్నం, హైదరాబాద్, విజయనగరంతో పాటు జిల్లాలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో షియా భక్తులు హాజరై సకీనాకు ఘనంగా నివాళులర్పించారు. ఉత్తరప్రదేశ్ నుంచి విచ్చేసిన మౌలానా సయ్యద్‌తాహిర్ ఆబేదిమషేద్ది మాట్లాడుతూ చిన్నారి సకీనా చీకటి బందీఖానాలో యజీద్ చేసిన దుర్మార్గానికి బలైందన్నారు. ఇమామ్‌హుస్సేన్ కుటుంబీకులు చేసిన త్యాగాలతోనే ఇస్లాం చరిత్రలో నిలిచిందన్నారు. అనంతరం ఊరేగింపుగా హజరత్ అబ్బాస్, బీబీ సకీనాఆలంను స్థానిక ముస్లింవీధి, హైస్కూలు సెంటర్ మీదుగా ఊరేగించారు. తొలుత మజ్లిస్ ఆలపించారు. అనంతరం గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించి రక్తం చిందేలా హుస్సేన్ హుస్సేన్ అంటూ కన్నీ పర్యవంతమయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు గురుహేఅలందారేహుసైనీ కమిటీ ఆధ్వర్యంలో భోజన వసతి సదుపాయాలు కల్పించారు. అధిక సంఖ్యలో షియా ముస్లింలు పాల్గొన్నారు.

'వడ్రంగి కార్మికుల ఉపాధిని దెబ్బతీసే
విధానాలకు అడ్డుకట్ట వేయాలి'



అమలాపురం ఆర్డీవో మాధవికి వినతిపత్రం అందజేస్తున్న చేతివృత్తుల సంక్షేమ సంఘ నాయకులు

అమలాపురంటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): వడ్రంగి కార్మికుల ఉపాధిని దెబ్బతీసే విధానాలకు అడ్డుకట్ట వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవాసంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం ఆర్డీవో కె.మాధవికి వినతిపత్రం అందజేశారు. టింబర్ డిపోలలో రెడీమేడ్ వేపకర్రలతో గుమ్మాలు, కిటికీలు అమ్మడంవల్ల వడ్రంగి కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన కూలీలతో భవన నిర్మాణరంగంలో పనులు చేయించడంవల్ల స్థానికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే ఆంక్షలు విధించి స్థానిక కార్మికులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 50 ఏళ్లు నిండిన చేతివృత్తిదారులకు పెన్షన్ మంజూరు చేయడంతోపాటు వడ్రంగి పనివారి కార్పొరేషన్ ఏర్పాటుచేసి జిల్లా సంఘానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, నాయకులు కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, కుసుమే నరసింహరాజు, యాలంగి రామకృష్ణ, పాలమూరు రామకృష్ణ పాల్గొన్నారు.

'ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు'



ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని నోటీసులు అందిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

అంబాజీపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని హాని కలిగించే విధంగా ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగిస్తే సంబంధిత షాపు నిర్వాహకులతోపాటు వాడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్ అన్నారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ పరిధిలోని షాపులు, బుధవారం సంత మార్కెట్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని ఆగస్టు 15లోపు నిలుపుదల చేయాలని, ఆపై ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే రూ.5000నుంచి రూ.10వేల వరకూ అపరాధ రుసుం విధిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గోశాలకు 200 కిలోల దాణా వితరణ

అంతర్వేది, జూలై30(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అనుబంధ దేవాలయమైన గోశాలకు బుధవారం పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన గుబ్బల రాజేష్-కరుణ దంపతులు కుమార్తె మోక్షిత పుట్టినరోజు సందర్భంగా 50కిలోల నాలుగు బస్తాలు గోధుమ పొట్టును అందించినట్టు ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. దాణా వితరణచేసిన దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

అట్టడుగు వర్గాలను

బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలి

● రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



రాజోలు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): అట్టడుగున ఉన్న వర్గాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాజోలు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్వర్ణాంధ్ర-2047, పీ4 విధానం అమలు, పారిశుధ్యం, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు తదితర అంశాలపై రాజోలు, మామిడికుదురు మండలాల సంబంధిత అధికారులతో బుధవారం జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పీ4 పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సమాజంలో అట్టడుగున ఉన్న 20శాతం కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్ది వారికి చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఆగస్టు 15 నుంచి అమలు చేయడానికి సంకల్పించారని తెలిపారు. పీ4 కార్యక్రమంలో ఒక కుటుంబాన్ని ఎవరైనా దత్తత తీసుకోవడం అనేది పూర్తిగా స్వచ్ఛందం, ఎవరికైనా ఈ కార్యక్రమంపై ఆసక్తి ఉంటే పేదలను పైకి తీసుకువచ్చే సదుద్దేశంతో మార్గదర్శక నమోదు చేసుకోవచ్చునన్నారు. ప్రభుత్వం పీ4లో రెండు రకాలుగా కుటుంబాలను దత్తత తీసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. ఆర్థిక సాయంతో కుటుంబాలను పైకి తీసుకురావడం ఒక విధానం అయితే ఎలా పైకి రావాలనే దానిపై కుటుంబాలకు మార్గదర్శనం చేయడం మరొక విధానమని తెలిపారు. సమాజంలో అధికంగా ఉన్నతస్థితిలో ఉన్నవారిని పారిశ్రామిక వేత్తలుగా, బాగా చదువుకున్న వారిని విదేశాల్లో స్థిరపడి గ్రామానికి ఎంతో కొంత సేవ చేద్దామనే దృక్పథం ఉన్న వారిని, వారి అంగీకారంతో మార్గదర్శకులుగా ఎంపిక చేయాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తించి ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసే సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లు ఎంతో ఉపకరమైనవని, భవిష్యత్తులో వాటి ద్వారా విద్యుత్ అవసరాలు తీర్చుకోవాల్సి పరిస్థితులు వస్తాయన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల గురించి ఎస్సీ ఎస్టీ గృహ యజమానులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి వారి ఇంటిపై ఏర్పాటుచేసే ఈ ప్లాంటు వల్ల నెలకు రూ.200 అద్దెరూపంలో ఆదాయం వస్తుందని తెలిపారు. 200 యూనిట్ల వరకు గృహ యజమాని ఉచితంగా విద్యుత్ వాటుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై సెక్రటరీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీనెల 3వ శనివారం ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, రాజోలు నియోజకవర్గ పీ4 స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తి, మండల స్పెషల్ అధికారి పి.బొజ్జిరాజు, ఏడీఏ బీవీ కృష్ణరాజా, వైస్‌ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, తహశీల్దార్లు సీహెచ్ భాస్కర్, సుధీర్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవోలు యు.శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్ తదితరులలు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చాలి

మలికిపురం: ఆగస్టు 15న రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీ4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమం ప్రధానమంత్రి సూర్యఘర్ ప్రోగ్రాం, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అంశాలపై ఎమ్మెల్యే దేవ బుధవారం మాట్లాడారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రభుత్వ కార్యక్రమాల అమలుతోపాటు లబ్ధిదారులకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు, పీ4 పథకంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల గుర్తింపు, పారిశుధ్య కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నియోకవర్గ ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి, డీఎల్పీవో బొజ్జిరాజు, ఎలక్ట్రికల్ ఏడీఈ, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల తహశీల్దార్లు పి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, గుండుబోగుల పెదకాపు, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, మిల్టన్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'అనుకున్న లక్ష్యసాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలి'

అంబాజీపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తాను అనుకున్న లక్ష్యసాధనకు కృషిచేయాలని విశ్రాంత శాస్త్రవేత్త, శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ కామిశెట్టి సత్యనాగభూషణరావు అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6నుంచి ఇంటర్ వరకు పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు దాతలు అందించిన సాయాన్ని బుధవారం పంపిణీ చేశారు. సత్యనాగభూషణరావు, తల్లిదండ్రులు కామిశెట్టి వీరస్వామినాయుడు-సూర్యాకాంతం ట్రస్టుపేరున 6నుంచి ఇంటర్ వరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలను అందించారు. హెచ్‌ఎం సాయిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ఉప్పలగుప్తం, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పలితాలపట్ల పూర్తి అవగాహన ఉండాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని ఉప్పలగుప్తం ఎస్‌ఐ సీహెచ్ రాజేష్ విజ్ఞప్తి చేశారు. భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగు రంగనాయకమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన సదస్సులో ఆయన విద్యార్థులు నేరాలకు పాల్పడకుండా ఎలా అదుపు చెయ్యాలో వివరించారు. విద్యార్థులకు, వేర్వేరుగా సదస్సులు నిర్వహించారు. నివాస ప్రాంతాలు, విద్యాలయాల సమీపంలో మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు.

'బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి'



ఎమ్మెల్యే ఆనందరావును సన్మానిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరబ్రహ్మం

అమలాపురం రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆనందరావును కలిసి దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు చొల్లంగి శ్రీధర్, కాకినాడ పట్టణశాఖ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్, స్టేట్ కౌన్సిలర్ కె.నాగరాజు, గీసాల శ్రీనివాసరావు, వాసంశెట్టి చక్రపాణితో పాటు తెలుగు మహిళ జిల్లాశాఖ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, చొల్లంగి అప్పాజీ పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి



విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ప్రాజెక్టు ప్రోగ్రాం కోఆర్డినేటర్ మమ్మీ

ముమ్మిడివరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలంలోని పాఠశాలలను సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. అనాతవరంలోని ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించి పీఎంశ్రీ అదనపు తరగతుల భవన నిర్మాణం, వంట షెడ్డు నిర్మాణాన్ని ఆమె పరిశీలించి అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను కూడా పరిశీలించారు. 6వ తరగతి, 10వ తరగతి చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల వినియోగం, పంపిణీకి సంబంధించి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలువేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్నభోజన పథకాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమె వెంట కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కె.సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం బి.హనుమంతరావు, జి.రాధ, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ జోన్ జాయింట్ కమిషనర్‌గా నియమితులైన సుందర్‌ను అభినందిస్తున్న ట్రాన్స్‌పోర్టు అధికారులు

ట్రాన్స్‌పోర్టు జోన్-2 జాయింట్ కమిషనర్‌గా సుందర్

మామిడికుదురు, జూలై 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలానికి చెందిన వడ్డి సుందర్ ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ అడ్మిన్ ఐటీ నుంచి బదిలీ అయి విజయవాడ జోన్-2 కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు రాష్ట్ర గవర్నర్ నుంచి వెలువడ్డాయి. విజయవాడ జోన్-2 జాయింట్ కమిషనర్‌గా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలకు సంబంధించి ఆయన జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తారు. ఆయన్ను సంబంధితశాఖల అధికారులు, పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. రాజోలు ప్రాంతానికి చెందిన వ్యక్తి రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి ఉద్యోగానికి ఎంపికవడంపై రాజోలు దీవివాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురంరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి నూతన వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా 11 కేవీలైన్లు మార్పేందుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. 11కేవీ రెడ్‌బ్రిడ్జి పీడర్, కళాశాల పీడర్, రావులర్ పీడర్ల వద్ద నున్న ఏరియాల్లో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈదరపల్లి వంతెన నుంచి మెయిన్‌రోడ్డు ముమ్మిడివరంగేటు సెంటర్, మున్సిపల్ కాలనీ, సీతాపతిరావుపేట, కూరగాయల మార్కెట్, దేవాంగులవీధి, సర్క్యులర్ బజార్, బైపాస్‌రోడ్డు, నల్లవంతెన, కలెక్టర్ కార్యాలయం రోడ్డు, ఈదరపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కాట్రేనికోన: ఆగస్టు ఒకటవ తేదీన పల్లంకుర్రు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చేపడుతున్నట్టు ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ

ముమ్మిడివరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం కొండాలమ్మచింత బైపాస్ రోడ్డులో నడిచి వెళుతున్న వ్యక్తి నుంచి ఇద్దరు యువకులు సెల్‌ఫోన్ లాక్కొని ఉడాయించారు. కాకినాడకు చెందిన కట్టం వెంకటేశ్వరరావు ముమ్మిడివరం కొండాలమ్మచింత వద్ద నడిచి వెళుతుండగా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి పడిపోతున్నట్టు నటించి వెంకటేశ్వరరావు వారి దగ్గరకు వెళ్లగా అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యాడు. దీంతో ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ డి.జ్వాలసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అజెండాలోని అంశాలను చర్చించకుండానే
ముగిసిన కౌన్సిల్ సమావేశం

● సమావేశం నుంచి వాకౌట్ చేసిన చైర్మన్

● చైర్మన్‌కు ఫ్లోర్ లీడర్‌కు మధ్య వాగ్వివాదం



చైర్మన్‌కు ఫ్లోర్ లీడర్‌కు మధ్య వాగ్వివాదం జరుగుతున్న దృశ్యం

ముమ్మిడివరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): సమస్యలపై చర్చ జరగకుండానే చైర్మన్ సమావేశంనుంచి వాకౌట్ చేయడంతో అర్థంతరంగా నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ముగిసింది. వార్డుల్లో జరిగే అభివృద్ధి పనుల్లో కౌన్సిలర్‌కు కనీస సమాచారం ఉండడం లేదని, చైర్మన్‌కే విలువ, గౌరవం ఇవ్వనప్పుడు ఇక కౌన్సిలర్‌కు ఏం విలువ ఇస్తారంటూ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో తొలుత సీడీపీవో ఎం.నిహారిక బాలల సంరక్షణ పర్యవేక్షణపై వివరించారు. అజెండాలోని అంశాలను సభ్యులకు వివరించి ఆమోదం కోసం చదివి వినిపించే కార్యక్రమం ప్రారంభించగా వైసీపీ కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ లేచి గత సమావేశాల్లో కౌన్సిలర్లు చర్చకు తీసుకువచ్చిన సమస్యల్లో ఎన్నింటిని పరిష్కరించారని ప్రశ్నించారు. చైర్మన్ స్పందించి నగర పంచాయతీలో అక్రమ కట్టడాలు, అనధరైజ్డ్ లేఅవుట్లు, ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకున్న తర్వాతే అజెండా ముందుకు వెళ్తుందన్నారు. ఆక్రమణలు, అక్రమ లేఅవుట్లపై ఆర్‌ఐ, కమిషనర్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో చైర్మన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. వార్డుల్లో అభివృద్ధి పనుల ప్రతిపాదనలను కౌన్సిలర్‌తో చర్చించకుండా వార్డు ఇన్‌చార్జిలతో చర్చించి ఎలా తయారు చేశారని ఏఈ శ్రీనివాస్‌పై చైర్మన్ మండిపడ్డారు. దీంతో చైర్మన్ తనకు, కౌన్సిలర్లకు గౌరవం లేనప్పుడు తాము ఎందుకంటూ తన చాంబర్‌లోకి వెళ్లిపోగా వైసీపీ కౌన్సిలర్లు ఆయన వెంట వెళ్లిపోయారు. కమిషనర్ రవివర్మ చైర్మన్ చాంబర్‌లోకి వెళ్లి నచ్చచెప్పి తీసుకువచ్చారు. దీనిపై చైర్మన్ స్పందించి అజెండాను ఆమోదిస్తున్నామని, తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదంటూ పేర్కొనగా మళ్లీ ఫ్లోర్ లీడర్‌కు, చైర్మన్‌కు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో కౌన్సిలర్లు వారిద్దరినీ సముదాయించారు. సభను అజెంబాలోని అంశాలు చర్చించకుండానే వాయిదా వేసి చైర్మన్ వెళ్లిపోయారు.

పరిసరాల పరిశుభ్రంతో ఆరోగ్యానికి భద్రత



గొల్లవిల్లి మెయిన్ రహదారిపై చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్య భద్రత ఉంటుందని గొల్లవిల్లి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా అన్నారు. బుధవారం ఆమె గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. గృహిణులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రహదారులు, కాల్వల పక్కన చెత్త తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి షెహన్‌షా, ఏడుకొండలు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గుర్తింపు

మామిడికుదురు, జూలై 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పలువురు వక్తలు కొనియాడారు. గోగన్నమఠం హైస్కూలులో పనిచేసి బదిలీపై వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయులకు స్థానికులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో మోకా వెంకన్నబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఉద్యోగ నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వహించిన వారికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని దానికి ఉదాహరణే ఈ సన్మాన కార్యక్రమమని పేర్కొన్నారు. మాజీ సొసైటీ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్‌ఎస్‌వర్మ, భూపతిరాజు సత్యనారాయణ రాజు, లంకే శ్రీనివాస్, సాగి బాబ్జి రాజు, అల్లు సురేష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

మామిడికుదురు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నిర్వహణలోచేసిన సేవలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి కొనియాడారు. పాశర్లపూడి సచివాలయంలో ఐదు సంవత్సరాలపాటు సచివాలయ ఉద్యోగులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని సర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఐదు సంవత్సరాల పాటు అంకిత భావంతో పనిచేసి పంచాయతీకి మంచిపేరు తీసుకువచ్చారంటూ వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుత్తుల వాసు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, వీఆర్వోలు నారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పీతల హేచరీకి స్థల సేకరణ

మలికిపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెంలో పీతల హేచరీ నిర్మాణం నిమిత్తం తూర్పుపాలెంలో ఐదు ఎకరాల స్థలాన్ని సేకరించి మత్స్యశాఖ అధికారులకు రెవెన్యూ అధికారులు అప్పగించారు. పీతల హేచరీ నిర్మాణం నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.2.75కోట్లు కేటాయించారు. తహశీల్దార్ టి.శ్రీనివాసరావుతోపాటు అధికారులు పాల్గొన్నారు.


క్వారీ లారీల్లో రక్తపింజర పాములు



స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్లు

అమలాపురం టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): క్వారీ లారీల్లో కోనసీమ జిల్లాకు రక్తపింజర పాములు వస్తున్నాయని స్నేక్ క్యాచర్ జంపన గణేష్ వర్మ అన్నారు. వరదలు, భారీ వర్షాల సమయంలో విషసర్పాలు ఇటీవల కాలంలో ఇళ్లలోకి చేరుతున్నాయని, వాటిని చంపకుండా తనకు సమాచారం అందించాలని కోరారు. అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక శ్రీవాసవీ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. సంఘ సభ్యులు తొలుత సంఘ అభివృద్ధిపై చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన గణేష్‌వర్మ పాముల ప్రవర్తన గురించి వివరించారు. ఎక్కడైనా విషసర్పం కనిపిస్తే సెల్ 9949956232కు ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చునన్నారు. అనంతరం గణేష్‌వర్మను అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి నూలు సూర్యప్రభాకరరావు, కోశాధికారి శ్రీఘాకోళపు రాంపండు, కోఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్‌తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలో రీజెన్సీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

యానాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి స్విమ్మింగ్, డైవింగ్, వాటర్ పోల్ అసోసియేషన్ నిర్వహించిన స్విమ్మింగ్ పోటీలను పుదుచ్చేరిలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో యానాం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో శిక్షణపొందిన పలువురు రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్ విద్యార్థులు పుదుచ్చేరి రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో ఎస్.హేమవర్షిణి 50మీ బ్యాక్‌స్టోక్‌లో స్టేట్‌సెకండ్ వెండి పతకం, 100మీ ఫ్రీస్టైల్స్ స్టేట్ 3ర్యాంక్‌లో కాంస్య పతకం, జి.లోహిత్‌శ్రీ హర్ష 400మీ ఫ్రీస్టైల్స్‌లో స్టేట్ ర్యాంక్, 100మీ బ్యాక్‌స్టోక్‌లో స్టేట్ 3వ ర్యాంక్, యస్.మృద్విక స్టేట్ 3 ర్యాంకు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈసందర్భంగా ప్రతిభ సాధించిన విద్యార్థులను వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వి.యస్.యస్.వి.ప్రసాదరావు, పీఈటి శ్రీనివాస్,ఇన్‌చార్జ్ సి.హెచ్. వీరభద్రరావు, తదితర ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పత్రికా ప్రకటన

జి.ఒ. ఎమ్.ఎస్. నెం. 131, తేది: 25.07.2025గా గల మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ ఆంధ్రప్రదేశ్ మరియు Lr.Roc.No.19022(31)/35/2022-RJDR తేది 29.07.2025గా గల డైరెక్టర్ ఆఫ్ టౌన్ & కంట్రీ ప్లానింగ్, మంగళగిరి, ఆంధ్రప్రదేశ్ వారి ఉత్తర్వులు ననుసరించి ప్రభుత్వం వారి అన్ని ప్రజా సేవలు అనగా భవన నిర్మాణాలు, లే ఔట్ ప్లాన్ అనుమతులు, పారిశుధ్య పనుల పర్యవేక్షణ మౌలిక సదుపా యాలు ఆన్లైన్ ద్వారా ప్రజలకు సమకూర్చుటకు జియో గ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జి.ఐ.యస్) ఉపయోగించుకుని ప్లానులని తయారు చేసుకొని ప్రభుత్వం వారితో ఆమోదింపచేసుకొన్నచో ప్రజలకు ఖచ్చితత్వముతో కూడిన సేవలు లభించుటకు వీలగునని, మండపేట పురపాలక సంఘ జి.ఐ.యస్. ఆధారిత మాస్టర్ ప్లాన్ తయారుచేసి ప్రభుత్వం వారికి ఆమోదం నిమిత్తం సమర్పించవలసిందిగా తెలియజేసి యున్నారు. అందుపై ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్ 2017 మరియు ఆంధ్రప్రదేశ్ లాండ్ డెవలప్మెంట్ (లే ఔట్ మరియు సబ్ డివిజన్) రూల్స్ కు లోబడి సదరు ముసాయిదా జనరల్ టౌన్ ప్లానింగ్ స్కీమ్ మాప్-1 మరియు మాప్-2 భవిష్యత్తులో 20 సంవత్సరముల వరకు అమలు పరచుటకు సదరు ముసాయిదా జనరల్ టౌన్ ప్లానింగ్ స్కీమ్ మాప్-1 మరియు మాప్-2 ను మండపేట పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రచురిస్తూ, సదరు ప్లాన్ పై ప్రజలకు ఎటువంటి అభ్యంతరములు మరియు సూచనలు ఉన్న యెడల మున్సిపల్ కమిషనర్, మండపేట వారికి 60 రోజులు లోపుగా లిఖిత పూర్వకముగా సమర్పించి నట్లయితే వాటిని ప్రభుత్వం వారికి సమర్పించి తదనుగుణముగా జనరల్ టౌన్ ప్లానింగ్ స్కీమ్ (మాస్టర్ ప్లాన్) పై ఫైనల్ నోటిఫికేషన్ ప్రభుత్వం వారు రిలీజు చేయుదురని మండపేట పట్టణ ప్రజలకు తెలియజేయడమైనది.

కమీషనరు
మండపేట పురపాలక సంఘం


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం

ఆదాయం రూ.3.65 లక్షలు

రూ.3,65,250 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారి ఆలయం ఎదురుగా నిర్మిస్తున్న కోనేరు నిర్మాణ పనులను ఈవో పరిశీలించారు. మాడ వీధుల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఫ్యాన్లను ఆయన పరిశీలించారు.


మాచరమట్టలు వద్ద రాళ్లు పైకి లేచి అధ్వానంగా మారిన రహదారి

రోడ్లు ఇలా ఉన్నా కనిపించవా?

• అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులు
• చోద్యం చూస్తున్న పాలకులు, అధికార యంత్రాంగం

కపిలేశ్వరపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులు అధ్వానంగా మారి ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. అక్కడి రహదారులపై రాకపోకలు సాగించాల్సి వస్తే వాహనదారులు, గ్రామస్తులు, ప్రయాణికులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. జొన్నాడ నుంచి కపిలేశ్వరపురం మీదుగా కోటిపల్లి ఆర్‌అండ్‌బీ ఏటిగట్టు రహదారి అనేక చోట్ల గుంతలతో పాటు, రాళ్లు పైకిలేచి ప్రమాదంగా మారింది. రోడ్డు మార్జిన్లు సైతం ఎక్కడి కక్కడ దిగబడిపోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ మార్గంలో అధికలోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్ప డిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కపిలేశ్వరపురం నుంచి అంగర, వెదురుమూడి రహదారి, మాచరమట్టలు, శ్రీరాంపురం, వెదురుమూడి-కాలేరు రహదారి నుంచి నల్లూరు మీదుగా టేకి వెళ్లే పంచాయతీరాజ్ ఆర్‌అండ్‌బీ రహదారులు ఛిద్రంగా మారాయి. అధికారులు, పాలకులు స్పందించి రహదారులను మెరుగుపర్చాలని స్థానికులతో పాటు వాహనదారులు తదితరులు కోరుతున్నారు.


శ్రీరాంపురం నుంచి కోరుమిల్లి వెళ్లే ఏటిగట్టు రహదారి దిగబడిపోయిన దృశ్యం

నానో ఎరువుల వాడకంపై రైతులు ఆసక్తి చూపాలి


పినపళ్లలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఆలమూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వరిసాగులో రైతులు సాధారణ ఎరువులకు బదులుగా నానో ఎరువులను ఉపయోగించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఆలమూరు మండలం పినపళ్లలో బుధవారం సర్పంచ్ సంగిత సుభాష్ అధ్యక్షతన రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఏవో మీనా మాట్లాడుతూ నానో ఎరువుల ఉపయోగించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. ముఖ్యంగా సాధారణ ఎరువుల కంటే వీటి వాడకం వల్ల ఖర్చు చాలా తక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల రైతులు నానో ఎరువులను ఉపయోగించడంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


ర్యాలి జడ్పీ హైస్కూల్‌లో మానవ అక్రమ రవాణా నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మానవ అక్రమ రవాణాపై విద్యార్థుల ర్యాలీ

ఆత్రేయపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ర్యాలీ జడ్పీ హైస్కూల్‌లో వేజ్ స్వచ్ఛంద సేవా సంస్థ, బోస్కో సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవ అక్రమ రవాణాపై పలువురు వక్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్యామల, ఎంపీడీవో రామన్, ఎంఈవో ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ర్యాలి సహకార సంఘ త్రిసభ్య కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం జరుపుతున్న జనసేన ఇన్‌చార్జ్ శ్రీనివాస్

సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి

ఆత్రేయపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): సహకార రంగం బలోపేతానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ర్యాలి ఉమాక మండలేశ్వర కోఆపరేటివ్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సొసైటీ చైర్మన్‌గా మెర్ల నాగేశ్వరరావు(జనసేన), సభ్యులుగా అడబాల దుర్గారావు, పసుపులేటి లోవరాజులతో శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, మాజీ సమితి అధ్యక్షులు ముద్దారి సుబ్బారావు, మాజీ సర్పంచ్ పి.పుల్లంరాజువర్మ, పెండెం వెంకన్న, బందెల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక

రావులపాలెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఊబలంక ఎంపీపీ పాఠశాలలో 6వ తరగతిలో నవోదయకు అప్సారి జ్ఞానప్రదీప్ ఎంపికైనట్లు ఎంఈవోలు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించి తల్లిదండ్రులను సత్కరించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు రూ.2వేల నగదు బహుమతిని ఎంఈవో ద్వారా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శాంతకుమారి, యూటీఎఫ్ నాయకులు సీహెచ్ శ్రీధర్, కోఆర్డినేటర్ బీఏఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

అగస్త్యేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.67 లక్షలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 30 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోనున్న బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామికి హుండీ ద్వారా రూ.3,67,582 ఆదాయం సమకూరింది. బుధవారం స్వామివారి హుండీలను దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీరామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో సీహెచ్ సత్యనారాయణ, సిబ్బంది, పలువురు భక్తులు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొత్తలంక ఎర్రయ్యాశాస్త్రి, చెరుకుపల్లి గణేష్ శర్మ, గొల్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కీచక కరస్పాండెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

రాయవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామంలోని మార్గదర్శి పాఠశాల కీచక కరస్పాండెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కీచక కరస్పాండెంట్ జయరాజుపై ఫోక్సో పరిధిలో కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.15 లక్షల ఆర్థికసాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.


బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

బాధిత కుటుంబానికి డీటీవో చేయూత

కొత్తపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రావులపాలెం మండలం గోపాలపురం హైవే మీద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపేట మండలం గంటికి చెందిన యడ్ల సుభాష్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి పలు వస్తువులను వారికి అందించారు. పీ-4 పథకంలో భాగంగా వీరి కుటుంబాన్ని ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.


ద్వారపూడి ఫ్లైఓవర్ వంతెనకు ఇరువైపులా ప్రమాదంగా మారిన గోతులు

గోతులతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

మండపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి ఫ్లైఓవర్ వంతెనకు ఇరువైపులా గోతులుపడి ప్రమాదంగా మారాయి. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ రోడ్డులో తరచూ గోతులవల్ల ప్రమాదాలు తలెత్తుతున్నాయి. ద్వారపూడి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుతోపాటు, ద్వారపూడి గ్రామానికి వెళ్లే వంతెన దిగువ రోడ్డు గోతులమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యుద్ధప్రాతిపదికన ఇక్కడి గోతులను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కల్యాణ్

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

కె.గంగవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మసకపల్లి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి గ్రామ సర్పంచ్ భర్త పి.కల్యాణ్ ఆర్థికసాయం చేశారు. ముప్పై సంవత్సరాలుగా తాతపూడి కొండయ్య పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో ఆయన మృతి చెందారు. దీనితో బాధిత కుటుంబాన్ని సర్పంచ్ భర్త పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం చేశారు.

గోశాలకు దాణా వితరణ

అంతర్వేది, జూలై 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది నరసింహస్వామి దేవస్థానంలో ఉన్న గోశాలకు బుధవారం వాడ్రేవుపల్లికి చెందిన గుబ్బల రాజేష్, కరుణ దంపతుల కుమార్తె మోక్షిత పుట్టినరోజు సందర్భంగా గోధుమ పొట్టును అందించినట్టు ఆలయ ఏసీ ఎంకేటీఎస్వీ ప్రసాద్ తెలిపారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించినట్టు తెలిపారు.

మండపేటను తూర్పు గోదావరి జిల్లాలో కలపాలి

• మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం ఆమోదం • అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం • కౌన్సిల్‌లో ఎమ్మెల్యే వేగుళ్లతో సహా సభ్యుల చురకలు • పట్టణంలో సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు ఆమోదం


మండపేట మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల. చిత్రంలో చైర్‌పర్సన్ రాణి

మండపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండపేటను అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలంటూ బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది. మండపేటను రాజమండ్రిలో కలిపే విషయంపై ఇప్పటికే తాను సీఎం చంద్రబాబుతో మాట్లాడానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. గత వైసీపీ పాలనలో అడ్డగోలుగా జిల్లాల విభజన జరిగిందని ఆయన ఆరోపించారు. మండపేటతోపాటు రూరల్‌ను రాజమండ్రిలో కలపడం ఖాయమన్నారు. సభ్యుల హర్షధ్వానాల మధ్య ఆమోదించారు. బుధవారం మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అజెండాలోని పలు అంశాలను ఆమోదించారు. మండపేటలో పట్టణ ప్రణాళిక విభాగం తీరు బాగాలేదని అనుమతులు ఒకటి తీసుకుని నిర్మాణాలు మరోలా చేస్తున్నారంటూ సభ్యుల ఆరోపణలపై టీపీవో రమ్య నీళ్ల నములుతూ బదులిచ్చారు. గతంలో అక్రమ భవనం అంటూ ఏడిద రోడ్డులో తొలగించారని, ఇటీవల చాలాచోట్ల నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని వైసీపీ కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ ప్రశ్నించారు. పట్టణంలోని పలు వీధులు, వార్డుల్లో నివాసాల ముసుగులో దుకాణ సముదాయాలు నిర్మించటం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని కౌన్సిలర్‌లు కమిషనర్ దృష్టికి తీసుకురాగా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. పట్టణంలో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని టీడీపీ కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి డీఈఈ శ్రీనివాస్ సమాధానం ఇస్తూ వర్షాకాలం కావడం వల్ల కార్బన్‌పట్టి లైట్లు వెలగటం లేదని ఆయన బదులిచ్చారు.

సోలార్ సిస్టం ఏర్పాటుకు చర్యలు

మండపేటలో సోలార్ సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ దుకాణాల సముదాయాలతోపాటు మున్సిపల్ స్థలాల్లో సోలార్ సిస్టం ఏర్పాటుతో విద్యుత్ బిల్లు ఆదా కావడంతో పాటు మిగులు విద్యుత్ విక్రయించుకునే వీలుంటుందని కమిషనర్ రంగారావు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోలార్ సిస్టంపై పట్టణ ప్రజలకు తెలియపరిచారా? అని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ విషయంలో తమకు సమాచారం లేదని కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా సత్వరమే దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల విద్యుత్ అధికారులతో మాట్లాడారు. అనంతరం పలు అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుడిగా షేక్ ఇబ్రహీం ప్రమాణ స్వీకారం: మున్సిపల్ కౌన్సిల్‌లో కోఆప్షన్ సభ్యుడిగా టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ షేక్ ఇబ్రహీం బుధవారం కోఆప్షన్ సభ్యుడిగా కౌన్సిల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన్ను ఎమ్మెల్యేతో పాటు, మున్సిపల్ చైర్‌పర్సన్, సభ్యులతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్ తదితరులు సత్కరించారు.

వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు రేషన్ ఇవ్వకుంటే చర్యలు: రేషన్ డీలర్లు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. అలాంటి డీలర్లపై చర్యలు తప్పని ఆయన హెచ్చరించారు. వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ పంపిణీ చేసే విషయంలో అధికారులు దృష్టిసారించాలని ఆయన సూచించారు. రెవెన్యూ శాఖతోపాటు సచివాలయ సిబ్బంది కూడా ఈ విషయంలో దృష్టిసారించాలని ఆయన కోరారు.



ద్రాక్షారామలో సుపరిపాలన తొలి అడుగులో కరపత్రాలు అందజేస్తున్న మంత్రి సుభాష్. పక్క చిత్రంలో ఆత్రేయపురం మండలం ర్యాలిలో స్థానికులకు బ్రోచర్‌ను అందిస్తున్న టీడీపీ శ్రేణులు

ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తాం

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నిలబెట్టుకుంటామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన ఉట్రుమిల్లి, తాళ్లపొలం గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి ఏడాది కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూనంపూడి రామకృష్ణంరాజు పేర్కొన్నారు. బుధవారం తాడిపూడి, వద్దిపర్రు, ఉచ్చిలి, ర్యాలి తదితర గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేతలు పాల్గొని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల యాప్‌లో పొందుపరిచారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెండెం వెంకన్న, సొసైటీ అధ్యక్షుడు తోటకూర సుబ్బరాజు, టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు వెత్సా అనిల్, సర్పంచ్ జుజ్జవరపు శ్యామల హరిబాబు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో తెలుగుదేశం శ్రేణులు ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఆర్కే ఆచార్యులు



కొత్తపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): కొత్తపేటకు చెందిన హైకోర్టు న్యాయవాది రామోజు నాగవెంకట సత్యనారాయణాచార్యులు (ఆర్కే ఆచార్యులు)ను ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీకి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా నియమించారు. ఈ మేరకు ఏపీ హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్ ఉత్తర్వులు అందించారు. రాష్ట్రంలో ముగ్గురు కౌన్సిల్ సభ్యులు ఉండగా అందులో ఒక్కరిగా ఆర్కే ఆచార్యులను నియమించారు. ఆయన్ను మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఏపీ హైకోర్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.చిదబరం, సీనియర్ కౌన్సిల్ టి.గిరిష్‌కుమార్ తదితరులు అభినందించారు. హైకోర్టు న్యాయవాదిగా చేసిన సేవలను గుర్తించి తన పేరును సిఫార్సు చేసిన సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


అవార్డు అందుకున్న వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కె.గంగవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆదర్శ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కె.గంగవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునికి బుధవారం సన్మానం చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు సీనియర్ ఉపాధ్యాయుడు పితాని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. అనంతరం వెంకటేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో సైన్స్ జిల్లా అధికారి పీఎస్ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు దాసరి శ్రీను, ప్రేమ్‌కుమార్, శ్రీధర్, ఏడుకొండలు, అయ్యంగారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలి

ద్రాక్షారామ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం రామచంద్రపురం మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్ర, జిల్లా కార్యదర్శి ఎం.ప్రదీప్, ఆడిట్ కమిటీ సభ్యులు పాకలపాటి శివ మాట్లాడారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు 2 నెలల జీతం చెల్లించాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండు చేశారు. ఆగస్టు 2న జరిగే ఫ్యాప్టో ధర్నాకు ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు వీవీఎస్ బాపూజీ, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, ఎం.రామకృష్ణ, సీహెచ్ శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు తదితరులుపాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు

కె.గంగవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల శివారు పి. కొంపలు, కూళ్ల తదితర పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దంగేరు ఆసుపత్రి ఆప్తమాలజీ అధికారి ఫణికుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పలువురు విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. దూర, దగ్గర దృష్టి లోపాలు గుర్తించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏ.వాసంతి, ఎంపీహెచ్ఏ ఏ.వెంకట రమణ, కె.సత్యవతి, ఏ.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కంటి పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది